క్లుప్తంగా

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: కొత్తగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పంచాయతీరాజ్ డీఈఈ శంకరయ్య ఆదేశించారు. మండలంలోని కోనరావుపేట, కీచులాటపల్లె, బాలరాజుపల్లె గ్రామాల్లో చేపట్టిన గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కు పలు సూచనలు చేశారు. పనులు నిర్ణయించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంతోశ్ ఉన్నారు.

పెద్దపల్లిలో బీఎస్పీ జెండా ఎగరడం ఖాయం



బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న దాసరి హన్మయ్య

ఓదెల: రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగరడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి భూమయ్య ధీమా వ్యక్తం చేశారు. ఓదెలలో బీజేపీ సీనియర్ నాయకులు శుక్రవారం బొంగోని సమ్మయ్యగౌడ్‌తో పాటు ఆటో యూనియన్ నాయకులు పసెండ్ల సతీశ్, మాట్ల స్వామి, రాచపల్లి మదునయ్య, ఎల్లయ్య, పల్కపాటి సదానందం, అయిత రమేశ్, రాకేశ్‌తో పాటు పలువురు హన్మయ్య సమక్షంలో బీఎస్పీలో చేరారు. బహుజనులు, ఆయా పార్టీల నాయకులు బీఎస్పీలో చేరడానికి చేరడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. బీఎస్పీ నాయకులు బోగె సదానందం, రాచర్ల నవీన్‌కుమార్, బీరం రవీందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో విధులు నిర్వహిస్తున్న 470 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లావుడ్య సురేశ్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద శుక్రవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవో 501 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎంలో వివిధ ప్రోగ్రామ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం డీఏ, హెచ్‌ఆర్‌ఏ అలవెన్సులను నిర్ణయించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాజు, ముఖ్య సలహాదారు ఎస్.పారిజాతం పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

కమాన్‌పూర్: మండలంలోని నాగారం, లింగాల గ్రామాల్లో పంటలో వాడే ఎరువుల వాడకంపై శుక్రవారం కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్ పిల్లి, ఏఈవో అజ్మీర సురేశ్ రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ చొప్పరి శ్రీనివాస్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన తొట్ల లక్ష్మికి మంజూరైన రూ.60వేల విలువైన చెక్కును శుక్రవారం జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు అందజేశారు. వెంకటేశ్, తొట్ల రాజు, కుంట శంకర్ ఉన్నారు.

లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

ఓదెల: పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టిక్కెట్‌ను జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌కు కేటాయించాలని పద్మశాలీ సంఘం జిల్లా ముఖ్య సలహాదారుడు చీకట్ల మొండయ్య, మండల అధ్యక్షుడు పర్శ రమేశ్ పేర్కొన్నారు. ఓదెలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కేసీఆర్ సేవాదళం పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులు చేశారన్నారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి, జిల్లా నాయకులు బొద్దుల సాయినాథ్, మండల నాయకులు డాక్టర్ ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ బీష్మాచారి, శ్రీనివాస్, సందీప్, వెంకన్న పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు

- గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడికి యత్నం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం
- చర్యలు తీసుకోని అధికారులు



గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

రామగిరి: మండలకేంద్రంతో పాటు ఆయాగ్రామాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. సెంటనరీకాలనీ క్వార్టర్ల వద్ద కుక్కల బెడద తీవ్రమవడంతో కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విధులు ముగించుకొని రాత్రిపూట ఇంటికొస్తున్న కార్మికులు, ద్విచక్రవాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు ఒంటరిగా వస్తున్న వారిపై దాడికి యత్నిస్తుండటంతో బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన సంఘటనలు వెలుగుచూస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం రాంనగర్‌కు చెందిన మహిళపై వీధి కుక్కలు దాడికి యత్నించగా కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కాలనీలో సంచరిస్తున్న వీధికుక్కల సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బారినుంచి కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జంకుతున్న చిన్నారులు

సెంటనరీకాలనీ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లాలంటే చిన్నారులు జంకుతున్నారు. తల్లిదండ్రులను తీసుకొని వెళ్తున్నా రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వెంట పడుతుండటంతో చిన్నారులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వీధికుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరతున్నారు.

కానరాని ప్రభుత్వ మార్గదర్శకాలు..

పెంపుడు జంతువుల నమోదు కోసం ప్రత్యేక మొబైల్ యాప్ తీసుకురావడం, కుటుంబ నియంత్రణ, కుక్క కాటు ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టడం తో పాటు కట్టడికి చర్యలు, విద్యార్థులకు పెంపుడు కుక్కలపై అవగాహన, హోటల్స్, రెస్టారెంట్స్, మాంసం వ్యర్థాలను వీధుల్లో వేయకుండా కట్టడి చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాల్లో ఉన్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు.

నియంత్రణ చర్యలు తీసుకోవాలి



కాలనీలోని గల్లీలతో పాటు మెయిన్ రోడ్డు వెంబడి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. మా పాపను పాఠశాలకు తీసుకువెళ్లాలంటే రోజూ భయంగా ఉంది. ఎప్పుడు మీదపడి దాడి చేస్తాయోనని ఆందోళనగా ఉంది.

– వరాల అంజయ్య, స్థానికుడు

రేబీస్ ప్రమాదకరం



కుక్కకాటుతో రేబీస్ సోకుతుంది. వ్యాక్సిన్ వేయిస్తే ప్రమాదం ఉండదు. కుక్కకాటుకు యాంటీరేబీస్ టీకా వేయించాలి. వెంటనే చికిత్స తీసుకుంటే ఫలితం ఉంటుంది. పెంపుడు కుక్కలకు విధిగా వ్యాక్సిన్ వేయించాలి.

– దుర్గప్రసాద్, మండల పశు వైద్యాధికారి, రామగిరి

రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగాలి



బీఎల్‌వోకు కిట్ అందజేస్తున్న ఆర్డీవో



కమాన్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

ఓదెల: రాబోయే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలకు ఎన్నికల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఓటుహక్కు ఇవ్వాలన్నారు. ఒకేవ్యక్తి రెండు ప్రదేశాల్లో ఓటుహక్కు కలిగి ఉంటాడని, అలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీచేసి తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఆర్ఐ బండ రాజేందర్, బీఎల్వోలు నంద రాజేశ్వరి, ఆసరి మహేశ్వరి, మూల లతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లిలో మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శుక్రవారం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి దుర్గారావ్, కోఆర్డినేటర్లు సదానందం, రవివర్మ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు..

కాల్వశ్రీరాంపూర్: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు తహసీల్దార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 2, 3వ తేదీల్లో ఓటరు నమోదుపై స్పెషల్ కాంపెయిన్‌లో భాగంగా ఫాం 6 ద్వారా తప్పులు సరిదిద్దాలని సూచించారు. ఓటరు నమోదు పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయా గ్రామాల బీఎల్‌వోలకు ఓటరు నమోదు కిట్లను పంపిణీ చేశారు. ఆర్ఐ వైశాలి, సూపరిటెండెంట్ ధీరజ్ కుమార్ పాల్గొన్నారు.

దళితబంధు జాబితాపై నిరసనలు



నిరసన తెలుపుతున్న దళితులు



కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

మంథని: దళితబంధు జాబితా మంథనిలో దుమారం లేపుతోంది. ఈ మేరకు శుక్రవారం పోటాపోటీగా నిరసన చేపట్టారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారిని దళితబంధు కింద ఎంపిక చేస్తే ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దళిత లబ్ధిదారులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మంథని ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లబ్ధిదారుల్లో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు కూడా ఉన్నారని, ఆ పార్టీకి చెందిన నాయకులతో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో దళితబంధు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులను ఎంపిక చేశారని కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శుక్రవారం వాణి విద్యానికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2008–09లో పదో తరగతి చదివిన విద్యార్థులు వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నార రమేశ్, రాసూరి చంద్రయ్య, శ్రీనివాస్, హైదర్‌ఖాన్, రాజునాయక్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు

ఆజాద్ అమృత్ మహోత్సవానికి మట్టి సేకరణ

గోదావరిఖనిటౌన్: ఆజాద్ అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలోని ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు భారత ప్రధాని పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కోదండ రామాలయంలోని అయ్యగార్లు మధు, శేఖర్ గృహాల నుంచి మట్టిని సేకరించి కార్యక్రమం ప్రారంభించారు. బీజేపీ నాయకులు సోమారపు సత్యనారాయణ సూచన మేరకు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, కార్పొరేటర్ దుబాసి లలితమల్లేశ్, నాయకులు గాండ్ల ధర్మపురి, రాచకొండ కోటేశ్వర్, మిట్టపల్లి సతీశ్‌కుమార్, డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

బహుజనులందరూ ఏకం కావాలి



కార్యక్రమంలో దాసరి ఉష, నాయకులు

ఎలిగేడు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బహుజనులందరూ ఏకమై రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాల్సిన సమయం వచ్చిందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో శుక్రవారం మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించారు.

పార్టీలో చేరికలు..

సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన మన ఊరు మన ఉష కార్యక్రమంలో గ్రామానికి చెందిన 50మంది పార్టీలో చేరగా వారికి కండువా ఆహ్వానించారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, జిల్లా కార్యవర్గసభ్యులు కాంపెల్లి బాబు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు నార్ల గోపాల్‌యాదవ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్, కోశాధికారి ఎండీ.రియాజ్, మండల అధ్యక్షుడు మారం సతీశ్‌యాదవ్, మహిళా మండల కన్వీనర్ బూస శారద, నాయకులు బాసంపల్లి నగేశ్, దుర్గం శంకర్, అల్లి రమేశ్, పూరెల్ల నరేశ్‌గౌడ్, ప్రసాద్, రాజేశంగౌడ్, అఖిల్, ప్రశాంత్, మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ అరుగురాళ్ల సాగర్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి పలువురు శుక్రవారం బీఎస్పీలో చేరారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేశ్ పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, సుల్తానాబాద్ మండల కోశాధికారి చంద్రశేఖర్, సుల్తానాబాద్ పట్టణ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, శ్రీనివాస్ సాదిక్ పాల్గొన్నారు.

బీసీ రాష్ట్ర డిక్లరేషన్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎస్పీ రాజయ్యగౌడ్

సుల్తానాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్‌గా కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను నియమించిన సందర్భంగా ఆయనను కరీంనగర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్పీ రాజయ్యగౌడ్ కలిసి సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు ఎనమల శంకర్ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహా ధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కాంపల్లి లక్ష్మణ్, గద్దె శ్రీనివాస్, పోచయ్య, పరశు రాములు, శ్యామ్, రామ్‌కిషన్ రావు, సంతోష్‌రెడ్డి, కిరణ్ కుమార్, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మణ్, కుమార్, నర్సయ్యగౌడ్, రజనర్స్, సుధాకర్‌రెడ్డి, స్వామి, చంద్రశేఖర్, సాంబయ్య, సతీశ్, రాజకుమార్, రమేశ్ ఉన్నారు.

పద్మశాలీ రాజకీయ శంఖారావం విజయవంతం చేయాలి

ఎలిగేడు: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం, ఎల్బీనగర్‌లోని కొండాలక్ష్మణ్ ప్రాంగణంలో 3న జరిగే పద్మశాలీ రాజకీయ శంఖారావం మండలంలోని పద్మశాలీలు తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్ పిలుపునిచ్చారు. 3న ఉదయం హైదరాబాద్ తరలివెళ్లేందుకు మండల కేంద్రంలో వాహనాలు అందుబాటులో ఉంటాయని మండలంలోని వివిధ గ్రామాల నుంచి పద్మశాలీ కుల బాంధవులు ఉదయాన్నే ఎలిగేడుకు చేరుకుని వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లాలని రమేశ్ తెలిపారు.

పత్తిసాగుపై క్షేత్రస్థాయి పర్యటన

రామగుండం: ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటలో చీడ, పీడల నివారణ తదితర సమస్యలను అధిగమించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పత్తి పంట సాగు చేస్తుండగా వ్యవసాయాధికారులు రైతులతో కలిసి క్షేత్ర పర్యటన చేపట్టి పత్తి సాగులో వస్తున్న సమస్యలను నేరుగా పరిశీలించి నివారణపై రైతులు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. అనంతరం సోమనపల్లి రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. వరి పంట పిలకదశ నుంచి కంకి దశకు చేరువలో ఉందని, గట్లపై ఉన్న గడ్డి చీడపీడలకు ఆవాసాలుగా మారే అవకాశం ఉండడంతో వాటిని క్రమం తప్పకుండా తొలగించాలని కోరారు. నూతన సాగు విధానంలో ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎగ్లాస్‌పూర్ క్లస్టర్ మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి హరీశ్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి బూక్య రాంబాబు పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పర్యటన, రైతుల అవగాహన సదస్సు సమావేశం జరిగింది.

సంక్షిప్త వార్తలు

✦ బ్యాగ్స్ అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట, చందపల్లి పాఠశాలల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ టీవీరావు సాయంతో శుక్రవారం క్లబ్ ప్రతినిధులు స్కూల్‌బ్యాగులు అందజేశారు.

✦ టీడీపీకి కంది చంద్రయ్య రాజీనామా

జ్యోతినగర్: టీడీపీకి చెందిన సీనియర్ టీఎన్టీయూసీ నాయకులు కంది చంద్రయ్య శుక్రవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

✦ ఆలీవర్ పాఠశాలలో వరలక్ష్మీ వ్రతం

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీవ్రతం పూజలు చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీవ్రతం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళలకు తాంబూలాలు అందజేశారు.

✦ చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన వెంకటకేదారి (45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నాలుగురోజుల క్రితం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతుండగా శుక్రవారం గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య స్వప్న, కుమారుడు శివమణికంఠ, కూతురు కాత్యాయని ఉన్నారు.


✦ ప్రభుత్వ పాఠశాలలో రీడ్ ఏ థాన్

గోదావరిఖనిటౌన్: ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యార్థులలో పుస్తకాలు చదవడంపై ఆసక్తిని పెంపొందించడానికి రూమ్ టు రీడ్ సంస్థ దేశవ్యాప్తంగా పాఠశాలల్లో సెప్టెంబర్ 1 నుంచి రీడ్ క్యాంపెయిన్‌లో భాగంగా రీడ్ ఏ థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎంపీపీఎస్ గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం పాఠశాల విద్యార్థులు చదవడంలో నిమగ్నమయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంథని మధు, రూమ్ టు రీడ్ ప్రతినిధి ఆర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

✦ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటకు చెందిన బుట్టి రాజమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, గొడిసెల ఉమ, ఎద్దు రాజయ్య, అనవేన నర్సయ్య, ఐట్ల పవన్, ఓదెలు ఉన్నారు.

శ్రీసంతోషిమాతకు బంగారుహారం బహూకరణ



రామగుండం: శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అమ్మవారి పూజకు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన గుంత వెంకన్న–వరలక్ష్మి దంపతులు బంగారు హారం బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు కోలాహలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, జాగటి శ్రీకాంత్, రవికుమార్, రవిచంద్ అమ్మవారి ఫొటోను దాతలకు బహూకరించి వారిని సన్మానించారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ హాజరయ్యారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యల పరిష్కారం



గర్రెపల్లిలో పర్యటిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు పడుతున్న సమస్యలు పరిష్కారం అవుతాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో శుక్రవారం గడపగడపకు పార్టీ–పల్లె పల్లెకు విజ్జన్న పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పాదయాత్ర చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాలు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ ఎత్తివేసి పబ్బం గడుపుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతి అరాచకాలకు చరమగీతం పాడాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులున్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ గెలుపు కోసం మైనార్టీ కార్యవర్గం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మస్రత్, కార్యదర్శిగా మహమ్మద్ సర్వర్‌పాషా, సంయుక్త కార్యదర్శిగా మహమ్మద్ రఫ్ నియామకమయ్యారు. కాగా శుక్రవారం విజయరమణారావు వారికి నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సుల్తానాబాద్‌రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు అరువ రఘునాథ్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్, కళాశాలలో భోజన విరామ సమయంలో శుక్రవారం ఉపాధ్యాయులు, లెక్చరర్లు సీపీఎస్‌కు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు పోచయ్య, శ్రీనివాస్, రామారావు, శ్రీధర్, పూర్ణచందర్, రాంప్రకాశ్, రాకేశ్, రజిత, ఫరహీన్, హరిప్రియ, అనురాధ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినూత్న నిరసన

జ్యోతినగర్: పెన్షన్ విద్రోహ దినోత్సం సందర్భంగా చెట్టుకు రాఖీ కట్టి వినూత్న నిరసన చేపట్టారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని మొక్కలకు శుక్రవారం రాఖీ కట్టి వృక్షా బంధన్ నిర్వహించి 'మేము నాటే మొక్క పర్యావరణ హితం.. మీరు సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ ఇవ్వాలనేది మా అందరి అభిమతం' అని నినాదాలు చేశారు. పర్యావరణ ప్రగతికి వృక్షం రక్ష అని, ప్రతి ఉద్యోగ, ఉపాధ్యాయుడికి పాతపెన్షన్ రక్ష వంటి నినాదాలు చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి త్రపం అందించారు. కార్యక్రమంలో రామగుండం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర

మంథనిలో..

మంథని: పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వివిధ పాఠశాలల్లో చెట్టును నాటి ఆ చెట్టుకు రాఖీ కట్టి వృక్ష రక్షాబంధన్ నిర్వహించారు. ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని పీఆర్‌టీయూఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కర్రు సురేశ్ కోరారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రఘుబాబు, ఎర్రం రమేశ్, రాష్ట్ర నాయకులు కానుగంటి శ్రీనివాస్, నాగరాజు, సూర్యప్రకాష్, సంతోష్, ఉమా మహేశ్ ఉన్నారు. జనార్దన్‌రావు, రవి పాల్గొన్నారు.

వార్డు అధికారులుగా విధుల్లో చేరిక

సుల్తానాబాద్: మున్సిపల్‌లో వార్డు అధికారులుగా సదయ్య, నారాయణ, సరిత శుక్రవారం విధుల్లో చేరారు. సుల్తానాబాద్‌లో పనిచేస్తున్న వార్డు అధికారులు, మంథనిలో పనిచేస్తున్న వార్డు అధికారులు మ్యూచువల్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా బదిలీలకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాబాద్‌లో వార్డు అధికారులుగా పని చేస్తున్న గీత, వినోద్, పోచం మంథని మున్సిపల్‌కు బదిలీ అయ్యారు.